సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 15 । డిసెంబర్ । 2024



జిట్టా పోరాట పటిమ గొప్పది
తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జిట్టా బాలకృష్ణారెడ్డి పోరాటం గొప్పదని పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. - 8లో



రూ.22 లక్షలు చోరీ
గుర్తుతెలియని దుండగులు ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.22 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. - 8లో



భారీ అగ్నిప్రమాదం
ఆలేరు పట్టణంలోని మల్లికార్జున కాటన్ మిల్లులో శనివారం జరిగిన అగ్నిప్రమాదంలో భారీగా నష్టం వాటిల్లింది. - 8లో

న్యూస్‌రీల్

16న ప్రజావాణి రద్దు

భువనగిరి టౌన్ : కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు గ్రూప్–2 పరీక్ష విధులకు హాజరుకానుండటంతో ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి అర్జీలు ఇవ్వడానికి కలెక్టరేట్‌కు రావద్దని సూచించారు.

జ్యోతిష్య శిరోమణి అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న నరసింహాచారి

సంస్థాన్ నారాయణపురం : జ్యోతిష్య విద్యలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంస్థాన్‌నారాయణపురం మండల కేంద్రానికి చెందిన ఆందోజు నరసింహాచారికి జ్యోతిష్య శిరోమణి అవార్డు దక్కింది. గీతా జయంతి పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానం, ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రోటర్‌లో మహతి ఆడిటోరియం సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నరసింహాచారికి టీటీడీ ప్రధానార్చకులు రంగాచారి, టీటీడీ రిటైర్డ్ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ డాక్టర్ నారాయణ, ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రోటర్‌లో డైరెక్టర్ నరసింహస్వామి, జ్యోతిష్య పండితుడు అరుణ్ మహేష్ అవార్డు అందజేశారు.

ముగిసిన తిరునక్షత్ర వేడుకలు


పారాయణం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 11నుంచి జరుగుతున్న శ్రీ తిరుప్పాణియాళ్వార్ తిరునక్షత్ర వేడుకలు శనివారం ముగిశాయి. ఉదయం ఆలయ ముఖ మండపంలో తిరుప్పాణియాళ్వార్‌ను అలంకరించి, ప్రబంధ పారాయణీకులతో సేవాకాలం చేపట్టారు. సాయంత్రం శ్రీస్వామి వారిని, ఆళ్వార్ సేవ, పురప్పాట్ సేవను ఆలయ తిరువీధిలో ఊరేగించారు. సేవకు ముందు పారాయణీకులు ఆళ్వారుడికి ఇష్టమైన ప్రబంధ పారాయణాలు పఠించారు.

డ్రెయినేజీ పనుల్లో కదలిక

సాక్షి ఎఫెక్ట్

చౌటుప్పల్ : 'బస్టాండ్‌కు బాట బంద్' శీర్షికన ఈనెల 13వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. చౌటుప్పల్ పట్టణంలో అండర్ పాస్ బ్రిడ్జి పనులు ప్రారంభంకానున్న నేపథ్యంలో సర్వీస్ రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మిస్తున్నారు. అందులో భాగంగా ఆర్టీసీ బస్టాండ్‌లోకి వెళ్లే మార్గంలో తవ్వకాలు చేపట్టారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయడాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది. దీంతో బస్సులు ఒకేదారి గుండా బస్టాండ్‌లోకి రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. ప్రయాణికులు, దుకాణదారులు, కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. 'సాక్షి'లో వచ్చిన కథనానికి కాంట్రాక్టర్ స్పందించి వెంటనే పనులు ప్రారంభించాడు.పనులు వేగంగా జరుగుతున్నాయి.


సిమెంట్ కాంక్రీట్ నింపుతున్న దృశ్యం



నారసింహుడికి నృత్య నీరాజనం

హైదరాబాద్‌కు చెందిన వంగా గీత నాట్య కళాకారుల బృందం శనివారం రాత్రి యాదగిరి క్షేత్రంలో కూచిపూడి నృత్యాలు చేసి అలరించారు. తూర్పు మాడ వీధిలోని సాంస్కృతిక వేదిక వద్ద కళాకారులు ప్రదర్శించిన నృత్యాలను భక్తులు తిలకించి తన్మయత్వం పొందారు.

-యాదగిరిగుట్ట

మిల్లర్ల మాయ!

రూ.146 కోట్లు విలువ చేసే సీఎంఆర్ ధాన్యం స్వాహా

- అధికారుల తనిఖీల్లో వెలుగులోకి
- రికవరీకి చర్యలు
- ఈనెల 31 వరకు గడువు
- చెల్లించకపోతే క్రిమినల్ కేసులు
- తప్పించుకోవడానికి అక్రమార్కుల యత్నం


భూదాన్‌పోచంపల్లి మండలం ముక్తాపూర్ రైస్ మిల్లులో చిందరవందరగా సీఎంఆర్ వడ్లు

సాక్షి, యాదాద్రి : ప్రభుత్వం కేటాయించిన సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లర్లు మాయచేశారు. అక్రమార్జన కోసం పక్కదారి పట్టించి రూ.కోట్లు సొమ్ము చేసుకున్నారు. ప్రభుత్వం ఎన్నిసార్లు గడువు పెంచినా అప్పగించకపోవడంతో ఇటీవల అధికారులు మిల్లుల్లో తనిఖీలు నిర్వహించారు. రూ.146 కోట్ల విలువైన టెండర్ ధాన్యాన్ని మాయం చేసినట్లు గుర్తించారు. అందులో ఎనిమిది మిల్లులు ఏకంగా రూ.80 కోట్లు విలువ చేసే వడ్లను అమ్ముకున్నట్లు తేల్చారు. మిల్లర్లనుంచి డబ్బులు రికవరీ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రెండు మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు.

కేటాయించిన వడ్లు ఇలా..

2022–23 యాసంగి సీజన్‌కు గాను మొత్తం 4,00,011 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని 40 మిల్లులకు కేటాయించారు. వడ్లను ఈ–టెండర్ ద్వారా కేంద్రీయ బండారు సంస్థకు ప్రభుత్వం అప్పగించింది. అందులో 2,99,925 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించారు. ఇంకా 1.86 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం మిల్లర్ల వద్ద ఉండాలి. కానీ, రికార్డుల్లో ధాన్యం ఉన్నట్లు చూపుతుండగా మిల్లుల్లో కనిపించడం లేదు. గడువులు పెంచినా సీఎంఆర్ అప్పజెప్పకపోవడంతో ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. బియ్యం ఇవ్వనిపక్షంలో టెండర్ ద్వారా కేటాయించిన వడ్లకు డబ్బులు చెల్లించాలని మిల్లర్లను ఆదేశించింది. ఒత్తిడి పెంచడం, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో 1,00,018 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లకు సంబంధించిన డబ్బులను ప్రభుత్వానికి చెల్లించారు. ఇంకా 67,366 మెట్రిక్ టన్నుల వడ్లకు సంబంధించి 146.85 కోట్లు చెల్లించాల్సి ఉంది. 10 మిల్లులు తమకు కేటాయించిన మేరకు వడ్ల డబ్బులను పూర్తిగా చెల్లించాయి. ఇంకా ఎనిమిది మిల్లుల వద్ద రూ.80 కోట్ల వరకు పెండింగ్ ఉన్నాయి.

మిల్లర్ల కొత్త ఎత్తుగడ

అమ్ముకున్న సీఎంఆర్ టెండర్ ధాన్యం డబ్బుల చెల్లించాలని మిల్లర్లపై ప్రభుత్వం నుంచి ఒత్తిడి పెరుగుతోంది.దీని నుంచి తప్పించుకోవడానికి మిల్లర్లు కొత్త ఎత్తుగడ వేస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలిప్‌పెన్స్ దేశానికి ఎగుమతి చేసే బియ్యం తాము సరఫరా చేస్తామని రాయబారాలు నడుపుతున్నట్లు తెలుస్తోంది.

అక్రమాలు ఇలా వెలుగుచూశాయి

సీఎంఆర్ బియ్యం ఇవ్వకుండా మిల్లర్లు మొండికేయడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు మిల్లుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పోచంపల్లి మండలం ముక్తాపూర్‌లోని లక్ష్మీనర్సింహ ఆగ్రోమిల్లు యజమాని రూ.10 కోట్ల విలువ చేసే వడ్లు అమ్ముకున్నట్లు గుర్తించారు. అలాగే గుండాల మండలం అనంతారంలోని రైస్‌మిల్లులో రూ.5.25 కోట్ల విలువ చేసే ధాన్యం పక్కదారి పట్టినట్లు తేల్చారు. అక్రమాలు వెలుగుచూడడంతో అధికారులు అప్రమత్తమై మిగతా మిల్లుల్లోనూ తనిఖీలు చేశారు. మొత్తంగా రూ.146 కోట్లు విలువ చేసే ధాన్యాన్ని మాయం చేసినట్లు తేలింది. కొన్ని మిల్లుల్లో ధాన్యం బస్తాలు చిందరవందరగా పడి ఉండడంతో అధికారులు లెక్క తేల్చలేక పోయారు.

31 వరకు డబ్బు చెల్లించాల్సిందే

మిల్లర్లకు కేటాయించిన టెండర్ వడ్ల డబ్బులు చెల్లించేందుకు ఈనెల 31వ తేదీ వరకు గడువు ఇచ్చాం. రూ.100 కోట్లకు పైగానే రావాలి. క్వింటాకు రూ.2,178 ప్రకారం చెల్లించాల్సి ఉంది. మిలర్లకు నోటీసులు జారీ చేశాం. వడ్లు కేటాయించే విషయంలో మిల్లర్లు పూచికత్తు ఇస్తారు.. కాబట్టి డబ్బులు చెల్లించే విషయంలోనూ వారే బాధ్యత వహించాలి. గడవులోపు చెల్లించకపోతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

–జగదీశ్వర్, సివిల్ సప్లై డీఎం

ఆరు కొత్త బస్సులు మంజూరు

నల్లగొండ రూరల్: నల్లగొండ డిపోకు ఆరు కొత్త బస్సులు మంజూరైనట్లు ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంజూరైన బస్సులను దేవరకొండ నుంచి మల్లేపల్లి, ముష్టిపల్లి, మర్రిగూడ, శివన్నగూడెం, చౌటుప్పల్, వలిగొండ నుంచి యాదగిరిగుట్టకు, మరో బస్ దేవరకొండ నుంచి మల్లేపల్లి, రేవల్లి, నాంపల్లి, మాల్ నుంచి హైదరాబాద్‌కు నడపనున్నట్లుపేర్కొన్నారు. అలాగే ఇంకో బస్సును దేవరకొండ నుంచి మల్లేపల్లి, ముష్టిపల్లి, నాంపల్లి, చండూరు మునుగోడు, కంచనపల్లి నుంచి నల్లగొండ వరకు, మరో రెండు బస్సులను నల్లగొండ నుంచి మునుగోడు, చొల్లేడు, చౌటుప్పల్, శివన్నగూడెం, మర్రిగూడ, మాల్, మరో బస్సును నల్లగొండ నుంచి మునుగోడు, వెలమ్కన్నె, శివన్నగూడెం, లోయపల్లి, రంగాపూర్, ఇబ్రహీంపట్నం వరకు, ఆరో బస్సును నల్లగొండ నుంచి కనగల్, చండూరు, లెంకలపల్లి, మర్రిగూడ నుంచి మాల్‌కు నడపనున్నామని పేర్కొన్నారు.

● మేస్త్రీ కుటుంబం నుంచి మ్యూజిక్ డైరెక్టర్

కృషి, పట్టుదలే పదాలు..చరణాలు

సక్సెస్ స్టోరీ



పాటంటే అతనికి ప్రాణం.. చదువుకునే వయస్సు నుంచి పాటలే లోకంగా బతికాడు. సంగీతం నేర్చుకుని సినీ రంగం వైపు అడుగేశాడు. తొలి రోజుల్లో అవకాశాలు రాక ఇబ్బంది పడ్డాడు. సొంతంగా సినిమా తీసి నష్టపోయాడు. అయినా పోగొట్టుకున్న చోటే రాబట్టుకోవాలనే తలంపుతో పట్టువదలని విక్రమార్కుడిలా ప్రయత్నించి వర్ధమాన సంగీత దర్శకుల సరసన చేరి రాణిస్తున్నాడు నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలో మేళ్లదుప్పలపల్లికి చెందిన కొండేటి చరణ్ అర్జున్.

– రామగిరి(నల్లగొండ)

సంగీత దర్శకుడిగా రాణిస్తున్న నల్లగొండ జిల్లా మేళ్లదుప్పలపల్లి వాసి

- విమానం, లగ్గం సినిమాలతో బ్రేక్.. కేసీఆర్ సినిమాతో భారీ హిట్
- పాటల రచనలోనూ రాణిస్తున్న చరణ్ అర్జున్
- ఫౌండేషన్లు స్థాపించి కొత్తవారికి అవకాశాలు.. గ్రామానికి సేవ


పాటలు రికార్డింగ్ చేస్తున్న చరణ్ అర్జున్

నల్లగొండ మండలం మేళ్లదుప్పలపల్లికి చెందిన కొండేటి మల్లేశం, గోపమ్మ దంపతుల నలుగురు సంతానంలో చరణ్ అర్జున్ పెద్దవాడు. తండ్రి సుతారి మేస్త్రీ పని చేసేవాడు. చరణ్ అర్జున్ 1 నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామంలో, 8 నుంచి 10వ తరగతి వరకు నల్లగొండలో చదువుకున్నాడు. గట్టుప్పల్‌లో ఇంటర్ చదివి.. ఆ తర్వాత హైదరాబాద్ తెలుగు యూని వర్సిటీలో మ్యూజిక్ కోర్సు పూర్తి చేశాడు. తన ప్రతి అడుగులో తన మేన బావ దండెం ప్రవీణ్‌కుమార్ ఉంటారని చెబుతున్నారు చరణ్ అర్జున్.

కేసీఆర్ సినిమాకు మంచి బ్యాగ్రౌండ్ మ్యూజిక్

విమానం, లగ్గం సినిమాలకు అందించిన సంగీతంతో చరణ్ అర్జున్‌కు గుర్తింపు వచ్చింది. అంతకుముందు కూడా పలు సినిమాలకు పనిచేశాడు. పెద్ద హీరోలకు పాటలు రాసి ట్యూన్ అందించాడు. కానీ ఆయన పేరు ఎక్కడా తెర మీద కనిపించలేదు. ఇటీవల విడుదలైన కేసీఆర్ సినిమాకు చరణ్ అర్జున్ సంగీతాన్ని అందించాడు. ఈ సినిమాలో బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌కు మంచి పేరు వచ్చింది. మాజీ సీఎం కేసీఆర్‌కు ఏ వల్లె పిల్లోడో.., ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డికి మూడు రంగుల జెండా.. అనే పాటలు రాసి, సంగీతం అందించాడు.

చిన్ననాటి నుంచి సాధన..

తెరమీద నటనకు అనుగుణంగా తెర వెనుక సాగే సంగీతం వీనుల విందుగా ఉండాలి. అందుకు అనుగుణంగానే చరణ్ అర్జున్ చిన్నప్పటి నుంచి సాధన చేశాడు. పాటలంటే అభిమానం పెరిగి మ్యూజిక్ కోర్సులు పూర్తి చేశాడు. సినిమాల్లో వచ్చిన చిన్న చిన్న అవకాశాలు సద్వినియోగపర్చుకున్నాడు 2014లో సొంత ఖర్చులతో సినిమా తీశాడు. ఆ సినిమా ఆడకపోవడంతో ఆర్థికంగా నష్టపోయాడు. ఆ తర్వాత అవకాశం రాకపోవడంతో సోషల్ మీడియా వేదికగా స్వయంగా రాసిన, ట్యూన్ చేసిన పాటలను యూ ట్యూబ్‌లో పెట్టాడు. వాటికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. దాంతో చరణ్ అర్జున్ ప్రజల్లోకి వెళ్లిపోయాడు. ఇప్పటి వరకు యూట్యూబ్‌లో 50 వరకు పాటలను అప్‌లోడ్ చేశాడు.

ఫౌండేషన్ ద్వారా కొత్తవారికి అవకాశం


సీఎం రేవంత్‌రెడ్డితో చరణ్ అర్జున్

తనలాగా అవకాశాలు లేకుండా ఎవరూ బాధపడొద్దని చరణ్ అర్జున్ కల్చరల్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. తెలంగాణ ప్రాంతానికి చెందిన కళాకారులు కనకవ్వ, వల్లాల వాణక్క, నల్లగొండ గద్దర్, భిక్షమమ్మ, వీహా, మహతి, సంజయ్ మహేష్ లాంటి కొత్త వారిని పరిచయం చేశాడు. ప్రతిభ, నైపుణ్యం ఉన్న వారిని వెలికి తీయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. అంతే కాకుండా ఊరికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఇటీవల చరణ్ అర్జున్ (సీ) టీమ్‌ను ప్రారంభించాడు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ, వ్యాపారస్తులు, వివిధ హోదాల్లో ఉన్న వారిని సమన్వయం చేసుకుని యువతకు ఉపాధి కల్పిస్తూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలనే అభిలాషతో ముందుకెళ్తున్నాడు.

చాలా సినిమాలకు అర్జున్ బాణీలు..

చరణ్ అర్జున్ వందేమాతరం శ్రీనివాస్, మణిశర్మ, యువన్ శంకర్ రాజా, సందీప్ చౌత, శంకర్ ఇసాన్ లాయ్ మ్యూజిక్ డైరెక్టర్ల వద్ద అసిస్టెంట్‌గా పనిచేశాడు. ఎన్.శంకర్ దర్శకత్వం వహించిన ఆయుధం సినిమాలో 'ఇదేమిటమ్మా మాయ మాయ మైకం కమ్మిందా' అనే పాటకు చరణ్ అర్జున్ బాణీలు రాశాడు. నందమూరి కళ్యాణ్‌రామ్ మొదటి సినిమా అయిన తొలిచూపులోనే సినిమాకు ఒక పాట రాసి తానే ట్యూన్ చేశాడు. రామ్ చరణ్ నటించిన ఒక సినిమాకు కూడా పాటను రాసి ట్యూన్ అందించాడు. దాంతో మంచి పేరు వచ్చింది.


మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో..

పండుగ వాతావరణంలో 'కొత్త డైట్'


ఆలేరులో మెనూను ప్రారంభిస్తున్న ముషారప్ అలీ


నారాయణపురంలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

- ఆలేరులో ఎస్‌పీడీసీఎల్ సీఎండీ, సంస్థాన్‌నారాయణపురంలో కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరు

ఆలేరురూరల్ : పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వసతిగృహాల్లో శనివారం నూతన డైట్ మెనూను పండుగ వాతావణంలో ప్రారంభించారు. పూలే గురుకుల పాఠశాలలో టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి మెనూను ప్రారంభించారు. విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, అందుకోసం బలవర్ధక ఆహారం అందించేందుకు డైట్ చార్జీలు పెంచిందని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ సధీర్ కుమార్, డీఈ వెంకటేశ్వర్లు, ఏడీఈ రాజశేఖర్, ఏఈ వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచికి తగినట్లుగా మెనూ

సంస్థాన్‌నారాయణపురం: విద్యార్థుల అభిరుచికి తగినట్లుగా ప్రభుత్వం కొత్తగా డైట్ మెనూ రూపొందించిందని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గురుకులంలో నూతన డైట్ మెనూ బోర్డు ఆవిష్కరించారు.అలాగే ఎస్‌టీపీ హ్యాండ్ బుక్ విడుదల చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల చదువు, ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. కార్యక్రమంలో గురుకుల విద్యాలయాల సంస్థ డిప్యూటీ సెక్రటరీ ప్రసాద్, ఎంపీడీఓ నర్సింహారావు,తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,192 కేసులు పరిష్కారం

భువనగిరిటౌన్ : జిల్లావ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 2,192 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు తెలిపారు. జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కక్షిదారులు రాజీపడదగినకేసులు పరిష్కరించుకుని ప్రశాంతమైన జీవనం సాగించాలని సూచించారు. రెండు క్రిమినల్ కేసులకు సంబంధించి బాధితులకు రూ.18 లక్షల నష్ట పరిహారం అందజేశారు. అనంతరం 15100 టోల్ ఫ్రీ నంబర్ ఫ్లెక్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉషశ్రీ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కవిత, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, పీపీలు పాల్గొన్నారు.


కక్షిదారులకు రాజీపత్రాలు అందజేస్తున్న జిల్లా ప్రధాన జడ్జి జయరాజు

● మటన్ మస్తుగుందా..


చౌటుప్పల్‌లోని బాలికల గురుకుల పాఠశాలలో శనివారం కొత్త డైట్ మెనూ ప్రారంభ కార్యక్రమానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హాజరయ్యారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మటన్ కూర మస్తుగుందా.. మంచిగ తినండంటూ నవ్వులు పూయించారు. ఆరోగ్యంగా ఉంటూ చదువులో రాణించాలని సూచించారు. -చౌటుప్పల్

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

నేడు, రేపు గ్రూప్–2 పరీక్షలు

- భువనగిరిలో 14 కేంద్రాలు
- హాజరుకానున్న 6,078 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

సాక్షి, యాదాద్రి, భువనగిరి : టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలకు కలెక్టర్ హనుమంతరావు ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. పరీక్షలు సజావుగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుంది. 14 కేంద్రాల్లో 6,078 మంది విద్యార్థులకు పరీక్ష రాయనున్నారు.

అరగంట ముందే గేట్లు బంద్

- 15వ తేదీన పేపర్–1 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరగనుంది. బయోమెట్రిక్ ఉన్నందున అభ్యర్థులను 9 గంటల నుంచే పరీక్ష కేంద్రం లోపలికి అనుమతిస్తారు. 9.30 గంటలకే కేంద్రాల గేట్లు మూసివేయనున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి నిరాకరిస్తారు. పేపర్–2 పరీక్ష మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు జరగనుంది. అభ్యర్థులను 2:30 గంటలకే కేంద్రం లోపలికి అనుమతిస్తారు.
- 16వ తేదీన పేపర్–3 పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపర్–4 మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30వరకు జరుగుతుంది. మొదటి రోజు నిబంధనలే రెండో రోజు కూడా వర్తించనున్నాయి.

సెంటర్లన్నీ జిల్లా కేంద్రంలోనే..

పరీక్షల నిర్వహణకు భువనగిరిలో 14 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో దివ్యబాల విద్యాలయం, శ్రీనవభారత్ డిగ్రీ, జాగృతి డిగ్రీ కళాశాల, శ్రీలక్ష్మీనర్సింహస్వామి డిగ్రీ కళాశాల, వెన్నెల కాలేజీ, భువనగిరి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్, మదర్ థెరిస్సా హైస్కూల్, యూనిటీ ఫార్మసీ కళాశాల, టైమ్స్ జూనియర్ కళాశాల, కృషి ఐటీఐ కళాశాల, శ్రీ సాయికృప డిగ్రీ కళాశాల, వాత్సల్య ఫార్మసీ, వాత్సల్య ఇంజనీరింగ్, వాత్సల్య పాలిటెక్నిక్ కళాశాల ఉన్నాయి.

అభ్యర్థులకు సూచనలు

- మొబైల్స్, ఎల్రక్టానిక్ పరికరాలకు అనుమతి లేదు.
- మెహందీ, టాటూలు వేసుకోరాదు. షూ ధరించవద్దు. చెప్పులతోనే రావాలి.
- బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తోనే పరీక్ష రాయాలి.
- టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌ను ఏ4 సైజ్ పేపర్‌లో కలర్ ప్రింట్ తీసుకోవాలి. హాల్‌టికెట్‌పై తాజా పాస్‌పోర్టు ఫొటో అతికించుకునిరావాలి.
- హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా లేనిపక్షంలో వైబ్‌సైట్‌లో పొందుపరిచిన ధ్రువీకరణపత్రాన్ని పూరించి మూడు పాస్‌ఫొటోలు అతికించి, గెజిటెడ్ అధికారి లేదా చివరగా చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపాల్ అటెస్ట్ చేయించి ఇన్విజిలేటర్‌కు అందజేయాలి.


భువనగిరిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

ఏర్పాట్ల పరిశీలన

సాక్షి,యాదాద్రి : భువనగిరిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల సెంటర్‌ను కలెక్టర్ హనుమంతరావు శనివారం సదర్శించారు. గ్రూప్–2 పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పరీక్ష సజావుగా జరిగేలా సమన్వయంతో పనిచేయాలని కోరారు. అభ్యర్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

క్లుప్తంగా

అందుబాటులో జవహర్ నవోదయ హాల్‌టికెట్లు

పెద్దవూర: మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాలకు నిర్వహించనున్న ప్రవేశ పరీక్షా హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రిన్సిపాల్ నాగభూషణం శనివారం తెలిపారు. వచ్చేనెల 18న పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఎదురైతే 94489 83776 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


అంజయ్య(ఫైల్)

తుంగతుర్తి: ఆర్థిక ఇబ్బందులతో పాటు కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గొట్టిపర్తి గ్రామానికి చెందిన తుసం అంజయ్య (43) కొన్ని సంవత్సరాల క్రితం భార్యాపిల్లలతో హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. అతడికి ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో పాటు, కుటుంబ కలహాలు తోడు కావడంతో తన స్వగ్రామమైన గొట్టిపర్తి గ్రామానికి 4 రోజుల క్రితం వచ్చి తనకున్న వ్యవసాయ పొలాన్ని అమ్మకానికి పెట్టాడు. వ్యవసాయ పొలం కొనడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో మనస్తాపం చెందాడు. వ్యవసాయ క్షేత్రంలో ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

వేములపల్లి: దామరచర్ల మండలం బొల్లిగుట్టతండాకు చెందిన లావూరి శివ ఈనెల 12న వేములపల్లి మండల కేంద్రంలోని సాగర్ ఎడమకాల్వలో దూకడంతో గల్లంతయ్యాడు. అతడి మృతదేహం శనివారం సూర్యాపేట జిల్లా పానుగోడు చెరువులో లభ్యమైనట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అయ్యప్ప మాలధారులకు ముస్లింల అన్నప్రసాద వితరణ


అన్నప్రసాద వితరణ చేస్తున్న ముస్లింలు

మోత్కూరు: మోత్కూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన మహ్మద్‌అలీ, జానీ సోదరులు శనివారం అయ్యప్ప మాలధారులకు అన్నప్రసాదం అందజేశారు. మున్సిపల్ కేంద్రంలోని అంగడిబజార్‌లో ఉన్న అభయాంజనేయస్వామి దేవాలయంలో ఈ భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ యాదాద్రి జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ డైరెక్టర్ పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, గురుస్వామి రామలింగం, నాయకులు కారుపోతుల శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, లెంకల వేణు తదితరులు పాల్గొన్నారు.

మొర ఆలకించండని.. మోకాళ్లపై దీక్ష



రెగ్యులరైజ్ చేయాలని శనివారం నల్లగొండ కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై కూర్చుని దీక్ష చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు – సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఏటీఎం పగులగొట్టి రూ.22లక్షలు చోరీ

- దామరచర్ల మండల కేంద్రంలో ఘటన

మిర్యాలగూడ: గుర్తుతెలియని దుండగులు ఏటీఎంను గ్యాస్ కట్టర్లతో పగులగొట్టి రూ.22,74,700 నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా దామరచర్ల మండల కేంద్రంలో శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దామరచర్ల మండల కేంద్రంలోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి వెంట ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలో నిర్వహణ సంస్థ శుక్రవారం రూ.16లక్షల నగదు నిల్వ ఉంచారు. అప్పటికే ఏటీఎంలో రూ.9లక్షలు ఉన్నాయి. మొత్తం రూ.25లక్షలకు గాను రూ.3లక్షల వరకు లావాదేవీలు జరిగాయి. శనివారం తెల్లవారు జామున 3.35గంటలకు దుండగులు ఏటీఎంలోకి ప్రవేశించి సీసీ కెమెరాలను పగులగొట్టి ఏటీఎంపై స్ప్రే చల్లారు. తమ వెంట తెచ్చుకున్న గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం కింది భాగాన్ని కట్ చేసి రూ.22,74,700 నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎంను ధ్వంసం చేసిన సమయంలో అలారమ్ అలర్ట్‌తో ఏటీఎం నిర్వహణ సంస్థ అప్రమత్తమై వాడపల్లి పోలీసులకు ఉదయం 4.20 గంటలకు సమాచారం ఇచ్చింది. పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకునేలోగానే దుండగులు నగదుతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఉదయం 6గంటలకు దామరచర్లకు చేరుకుని ఏటీఎం కేంద్రాన్ని పరిశీలించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. వేలిముద్రలను సేకరించి పాత నేరస్తులతో పోల్చి చూశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. తెల్లకారులో కొంతమంది దుండగులు వచ్చి ఏటీఎం చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. సీసీ పుటేజీ ఆధారంగా చోరీ సమయంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వాహనాలను, వ్యక్తులను విచారించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సీఐ వీరబాబు, ఎస్‌ఐ హరికృష్ణ ఉన్నారు.


ఏటీఎంను పరిశీలిస్తున్న నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్, డీఎస్పీ రాజశేఖర్‌రాజు

పత్తి బేళ్లు మీద పడి మృతి

నాగారం: పత్తి బేళ్లు మీద పడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన నాగారం మండలంలోని ప్రగతినగర్‌లో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఖండువా జిల్లా, పంధనా మండలం అర్థాల గ్రామానికి చెందిన కట్టె నాయక్‌రాం(26)కు భార్య కట్టె ప్రమీల బాయ్, రెండేళ్ల కుమార్తె ఉంది. జీవనోపాధి కోసం నెల రోజుల క్రితం నాగారం మండలానికి వచ్చాడు. ఈటూరు ఆవాసం ప్రగతినగర్‌లో ఉన్న శ్రీ శ్రీనివాస పత్తి మిల్లులో పని చేస్తున్నాడు. శుక్రవారం పత్తి మిల్లులో పనిచేసి రాత్రి భోజన సమయంలో భార్య ప్రమీలాబాయ్‌తో గొడవపడి తనకు కేటాయించిన గదిలో కాకుండా పత్తి మిల్లు ఆవరణలో ఉన్న పత్తి బేళ్లపై నిద్రించేందుకు వెళ్లాడు. అర్ధరాత్రి సమయంలో ప్రమాదవశాత్తు పత్తి బేళ్లు కూలాయి. దీంతో నాయక్‌రాం పత్తిలో కూరుకపోయి ఊపిరాడక మృతి చెందాడు. తెల్లవారు జామున అతడి భార్య ప్రమీల బాయ్ తన భర్త కోసం వెతుకుతుండగా నాయక్‌రాం పత్తిలో కూరుకపోయి విగతజీవిగా కనిపించాడు. దీంతో ఆమె బోరున విలపిస్తూ తోటి కార్మికులకు, మిల్లు యాజమాన్యానికి విషయాన్ని తెలియజేసింది. నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఐలయ్య అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య కట్టె ప్రమీలబాయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఐలయ్య తెలిపారు.


నాయక్‌రాం మృతదేహం

గుండెపోటుతో బాలుడు మృతి


హర్షిత్ (ఫైల్)

బొమ్మలరామారం: గుండెపోటుతో బాలుడు మృతి చెందిన సంఘటన శనివారం బొమ్మలరామారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యావపూర్ తండాకు చెందిన దీరావత్ నర్సింహ– విజయ దంపతులకు హర్షిత్(08) కుమారుడు. రెండవ శనివారం, ఆదివారం రెండు రోజులు పాఠశాలకు సెలవు కావడంతో శుక్రవారం హర్షిత్ హైదరాబాద్‌లోని హబ్సిగూడలో ఉంటున్న తన అమ్మమ్మ ఇంటికి వెళ్లాడు. ఆడుకుంటున్న హర్షిత్ తనకు నొప్పిగా ఉందని తన అమ్మమ్మకు తెలిపాడు. ఆస్పత్రికి తీసుకెళ్లడంతో చికిత్స అందించారు. గుండెపోటు రావడంతో శనివారం మృతి చెందాడు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. రెండవ శనివారం సెలవు రోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో శ్రీస్వామిని దర్శించుకునేందుకు వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, మాడ వీధులు భక్తులతో సందడిగా మారాయి. శ్రీస్వామిని భక్తులు అధికంగా దర్శించుకునేందుకు రావడంతో ధర్మ దర్శనానికి 3గంటల సమయం, వీఐపీ దర్శనానికి 1గంట సమయం పట్టింది. యాదగిరీశుడిని సుమారు 30వేల మందికి పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో శ్రీస్వామి వారికి నిత్యాదాయం రూ.40,59,794 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

ఆలయ మాడ వీధిలో నెలకొన్న భక్తుల రద్దీ →



ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యం

- తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య


బెల్లి లలిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భువనగిరిటౌన్: ప్రజాస్వామిక తెలంగాణే లక్ష్యమని తెలంగాణ మలిదశ ఉద్యమకారులు గాదె ఇన్నయ్య, పాశం యాదిగిరి అన్నారు. శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బెల్లి లలిత, గోపే రాజయ్య చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్య, వైద్యం ప్రజలందరికీ దక్కాలని ఆ దిశగా ఉద్యమించాలన్నారు. రాష్ట్ర కన్వీనర్ నాగభూషణం మాట్లాడుతూ... ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణకు తెలంగాణ ప్రజా ఫ్రంట్ పని చేస్తుందన్నారు. అనంతరం మహాసభలో జిల్లా కమిటీ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలని, రామన్నపేటలో అంబుజా సిమెంట్ కంపెనీని రద్దు చేయాలని మహాసభ తీర్మానం చేసింది. జిల్లా కన్వీనర్ కాశపాక మహేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మైలారం సత్యం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అశోక్, రామచంద్రయ్య, సీనియర్ జర్నలిస్టు మల్లారెడ్డి, టీపీఎఫ్ జిల్లా కో కన్వీనర్ యాదయ్య, వెంకన్న, రాంబాబు, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి.. గొంతు కోసుకుని ఆత్మహత్య

- మృతుడు కేతేపల్లి వాసి

చిట్యాల: పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలో జాతీయ రహదారికి సమీపంలో శనివారం వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పురుగుల మందుతాగి.. గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి గ్రామానికి చెందిన రామగిరి శ్రీనివాస వరప్రసాద్(59) గత కొనేళ్లుగా నల్లగొండలో కుటుంబసభ్యులతో కలిసి ఉంటున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆయన ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో జూనియర్ క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్‌గా హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. గత మూడు నెలలుగా వరప్రసాద్ విధులకు వెళ్లడం లేదు. చిట్యాల పట్టణంలోని రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారి సమీపంలో ఉన్న వ్యవసాయ పొలాల్లో ఇతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి చిట్యాల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నార్కట్‌పల్లి సీఐ నాగరాజు, చిట్యాల ఎస్‌ఐ ధర్మా సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పురుగుల మందు తాగడంతో పాటు అతడి గొంతు వద్ద లోతుగా తెగినట్లుగా ఉంది. మృతదేహం పక్కన పురుగుల మందు డబ్బా, కత్తితో పాటు సెల్‌ఫోన్, ఆతను పనిచేస్తున్న సంస్థ ఐడెంటిటీ కార్డు పోలీసులకు లభ్యమైంది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్ర అప్పుల్లో కూరుకుపోవటంతో మనస్థాపానికి గురై బలవన్మరణానికి పాల్పడినట్లు మృతుడి భార్య రుక్మిణి శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


చిట్యాలలో వరప్రసాద్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కాటన్ మిల్లులో భారీ అగ్ని ప్రమాదం

- దాదాపు 250 క్వింటాళ్ల పత్తి దగ్ధం

ఆలేరురూరల్ : యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలోని మల్లికార్జున కాటన్ మిల్లులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. రైతుల నుంచి మిల్లర్ కొనుగోలు చేసిన పత్తిని మిల్లు ఆవరణలో నిల్వ ఉంచారు. షార్ట్‌సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మిల్లులో మంటలు చెలరేగాయి. దీంతో మిల్లులో ఉన్న అధికారులు బయటికి పరుగులు తీశారు. ఈప్రమాదంలో సుమారు 250 క్వింటాళ్ల పత్తి దగ్ధం కాగా.. దాదాపు 18లక్షల ఆస్తినష్టం జరిగి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. ఘటనా స్థలాన్ని ఆలేరు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ చైతన్య, ఎస్‌ఐ రజీకర్, కాంగ్రెస్ నాయకులు పరిశీలించి కారణాలను అడిగి తెలుసుకున్నారు.


మల్లికార్జున కాటన్ మిల్లులో దగ్ధమవుతున్న పత్తి

చిలుకూరులోనూ ఆ యువతి బాధితులు

- ఎస్‌ఐ ఆత్మహత్య కేసులో బానోతు అనసూర్య అరెస్టు
- గతంలో పలువురిపై ఫిర్యాదు చేసిన అనసూర్య

చిలుకూరు: ములుగు జిల్లా వాజేడు ఎస్‌ఐ రుద్రారపు హరీష్ ఆత్యహత్యకు కారణమైన యువతిని పోలీసులు అరెస్టు చేసిన ఆ యువతి స్వగ్రామైన చిలుకూరు మండలం దూదియాతండాలో ఈ విషయం చర్చనీయాంశమైంది. ఈ నెల 2న ఎస్‌ఐ హరీష్ ఆత్మహత్య చేసుకోగా.. ఆ ఘటనకు సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలం దూదియాతండాకు చెందిన బానోతు అనసూర్య కారణమని అప్పటి నుంచి మీడియాలో ప్రచారమైంది. ఎస్‌ఐ ఆత్మహత్యతో తనకు సంబంధం లేదని ఆమె పలు మీడియా ఛానల్స్‌లో ఇంటర్వ్యూలు కూడా ఇచ్చింది. అయితే, పోలీసులు ఆమెను పూర్తిస్థాయిలో విచారించి అరెస్టు చేశారు.

పలువురిపై కేసు

ఆ యువతి బాధితులు చిలుకూరులో కూడా ఉన్నట్లు తెలిసింది. విజయనగరానికి చెందిన శ్రీను అనే వ్యక్తి తనను ప్రేమించి మోసం చేశాడని ఆమె గతంలో చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఇక్కడే కాకుండా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కూడా అతడిపై కేసు పెట్టింది. ఇటీవల చిలుకూరుకు చెందిన ఒక వ్యక్తి తనను మోసం చేశాడని కేసు పెట్టింది. ఆమె మీద కూడా కోదాడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

టాటాఏస్, టవేరా ఢీ.. ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు సూర్యాపేట జిల్లావాసి


సంపత్ (ఫైల్)

దేవరుప్పుల: జనగామ జిల్లా దేవరుప్పుల మండలం చింతబాయి తండా సమీపంలో జనగామ–సూర్యాపేట రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందగా, ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జనగామ నుంచి సూర్యాపేట వైపునకు టాటాఏస్ ట్రాలీ వాహనం వెళ్తోంది. ట్రాలీలో మరిపెల్లి యాకయ్య(46), సూరపల్లి సంపత్(52) అనే ఇద్దరు ప్రయాణికులు నిల్చున్నారు. చింతబాయి తండా సమీపంలోకి రాగానే టాటా ఏస్‌ను ఎదురుగా వస్తున్న టవేరా ఢీకొట్టింది. వాహనాలు నుజ్జునుజ్జయ్యాయి. రెండు వాహనాల్లోని వారు బయటికి వచ్చే వీలులేకుండా పోయింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని ఇరువాహనాల క్యాబిన్లలో ఇరుక్కున్న ఎనిమిది మందిని బయటకు తీశారు. అందరినీ చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగ్రాతుల్లో ఓ మహిళ పరిస్థితి విషమించండంతో వరంగల్‌కు తరలించారు. కాగా, రెండు వాహనాలను రోడ్డు పక్కకు తీసే క్రమంలో టాటాఏస్ వాహనం వెనుక చూడగా ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుల్లో ఒకరు జనగామ జిల్లా దేవరుప్పుల మండలం కామారెడ్డిగూడేనికి చెందిన మరిపెల్లి యాకయ్య(46), మరొకరు సూర్యాపేట జిల్లా తిర్మలగిరికి చెందిన సూరపల్లి సంపత్(52)గా గుర్తించారు. పరిపెల్లి యాకయ్య జనగామ జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల దీక్షకు ఐదురోజుల నుంచి హాజరవుతున్నాడు. శనివారం కూడా హాజరై స్వగ్రామానికి వచ్చే క్రమంలో ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో టాటా ఏస్ ట్రాలీలో ప్రయాణించాడు. అలాగే, సంపత్ కూడా స్వగ్రామానికి వెళ్లేందుకు టాటా ఏస్ ట్రాలీలో ప్రయాణించాడు. యాకయ్య కుమారుడు బెనహర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ, ఎస్సై తెలిపారు.

సీఐపై ఎస్పీకి ఫిర్యాదు

- తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తి ఆరోపణ
- ఆధారాలతో ఫిర్యాదు చేశానంటున్న బాధితుడు

నల్లగొండ క్రైం : తన భార్యతో నల్లగొండ పట్టణ టూటౌన్ సీఐ డానియల్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఓ వ్యక్తి ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌కు శనివారం ఫిర్యాదు చేశాడు. సదరు సీఐ తన భార్యతో కాపురం చేయనీయకుండా మనోవేదనకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు విషయాన్ని బాధితుడు విలేకరులకు తెలిపాడు. వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన దంపతులు వారి సొంత ఇంటిని విక్రయించుకున్నారు. దానికి సంబంధించిన దస్తావేజులు తీసుకునేందుకు పట్టణంలో ఓ బ్యాంకు వెళ్లారు. ఆ తర్వాత భార్య పట్టణంలోని టూటౌన్ సీఐ వద్దకు వెళ్లి తనపై పలు ఆరోపణలతో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో సీఐ డానియల్ ఆమెతో చనువు పెంచుకుని తన భార్యకు తరచూ ఫోన్, చాటింగ్ చేస్తూ.. వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని బాధితుడు తెలిపాడు. తనను పదేపదే స్టేషన్‌కు పిలిపించి బెదిరించారని.. ఊళ్లో ఉన్న పొలం అమ్ముకుని వస్తే కేసులు తీసివేస్తామని, భార్యతో విడాకులు ఇప్పిస్తానని వేధించాడని పేర్కొన్నాడు. తన భార్యకు ప్లాటు కొనిస్తానని, డబ్బులు ఇస్తానని నమ్మబలికి లోబరుచుకున్నాడని ఆరోపించాడు. తన భార్య సెల్‌ఫోన్ తనిఖీ చేయగా సీఐతో చాటింగ్‌లు చేసిన విషయం తెలిసిందని.. ఈ చాటింగ్ తదితర ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేశానని బాధితుడు తెలిపాడు. తన భార్య, సీఐతో తనకు ప్రాణహాని ఉందని పేర్కొన్నాడు. కాగా.. ఈ ఘటనపై సీఐ డానియల్ స్పందిస్తూ తనపై చేసిన ఫిర్యాదులో వాస్తవం లేదని తెలిపారు. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా తనపై నిందలు వేస్తున్నారని పేర్కొన్నారు.

ఫిర్యాదుపై విచారణ చేస్తున్నాం

– ఎస్పీ శరత్‌చంద్ర పవార్

సీఐపై వచ్చిన ఫిర్యాదుపై నల్లగొండ డీఎస్పీ విచారణ చేస్తున్నారని, ఫోన్ చాటింగ్ పరిశీలిస్తున్నామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. డీఎస్పీ నివేదిక ఆధారంగా సీఐపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జిట్టా పోరాట పటిమ చాలా గొప్పది


విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న పైళ్ల శేఖర్‌రెడ్డి, జిట్టా కుటుంబ సభ్యులు

- మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

బీబీనగర్: తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన దివంగత నేత జిట్టా బాలకృష్ణారెడ్డి పోరాట పటిమ చాలా గొప్పదని మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. బీబీనగర్‌లోని జిట్టా అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహాన్ని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా పైళ్ల శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. చిన్న వయసులోనే నాయకత్వ లక్షణాలు అలవర్చుకున్న జిట్టా బాలకృష్ణారెడ్డి గ్రామగ్రామాన వాటర్ ప్లాంట్లు పెట్టాడని ఆయన స్ఫూర్తితోనే తాను ఫిల్టర్లు ఏర్పాటు చేశానని తెలిపారు. ఎమ్మెల్యే, ఎంపీ కంటే గొప్ప పేరు తెచ్చుకున్న జిట్టా అందరి అభిమానం చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ ప్రణీతాపింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్యామ్‌గౌడ్, రామాంజనేయులుగౌడ్, ఆంజనేయులుగౌడ్, నరేంధర్‌రెడ్డి, శంకర్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, రవి, భాస్కర్, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం చేయాలి

నల్లగొండ: రైతులు ప్రకృతి వ్యవసాయం చేయాలని సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు విజయ్‌రామ్ అన్నారు. ఆవు ఎరువుతో చేసే సహజ వ్యవసాయంపై శనివారం నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఒక్క దేశవాళి ఆవుతో 30 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేసే విధానాన్ని శిక్షణలో వివరిస్తామన్నారు. ఫిబ్రవరి 15 నుంచి 24 వరకు హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అంజిరెడ్డి, హుస్సేన్‌బాబు, సురేష్‌గుప్త, రమేష్, గోనారెడ్డి పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు షేక్ నజియా

చండూరు: ఇటీవల మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగిన 32వ జూనియర్ నేషనల్ ఫెన్సింగ్ చాంపియన్ షిప్‌లో బంగారుగడ్డ గ్రామానికి చెందిన షేక్ నజియా ద్వితీయ బహుమతి పొంది సిల్వర్ మెడల్ సాధించింది. ఫైనల్ చేరిన షేక్ నజియాను చండూరు ఫెన్సింగ్ అకాడమీ వ్యవస్థాపకుడు ఎండీ రహమత్ శనివారం స్థానికంగా అభినందించారు.